సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.21,810

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,810 పలికాయి.



అతడికి ఆమె ఆధారం

డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం సాగించే అతడిని అనారోగ్యం దెబ్బతీసింది. భర్తకు సపర్యలు చేయడంతో పాటు కుటుంబ పోషణ భారం భార్యపై పడింది. 8లో

గరిష్టం/కనిష్టం
41.9°/20.1°

జిల్లా పరిధిలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేసవితాపం అధికమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

భువనేశ్వర్-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా భువనేశ్వర్-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 24 నుంచి జూన్ 28 వరకు ప్రతి శనివారం భువనేశ్వర్ (02811) జంక్షన్ నుంచి యశ్వంత్‌పూర్‌కు రైలు బయలుదేరుతుందన్నారు. అదేవిధంగా మే 26 నుంచి జూన్ 30 తేదీ వరకు ప్రతి సోమవారం యశ్వంత్‌పూర్ జంక్షన్ నుంచి బయలుదేరుతుందన్నారు. విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, ధర్మవరం జంక్షన్, ఎస్ఎస్ఎస్‌పీ నిలయం, హిందూపురం రైల్వేస్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

3 రోజుల సంతాప దినాలు

ప్రశాంతి నిలయం: పోప్ ఫ్రాన్సిస్ మృతికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22 నుంచి మూడు రోజులపాటు సంతాప దినాలు ప్రకటించిందని కలెక్టర్ చేతన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతాప దినాల సమయంలో ఆంధ్రప్రదేశ్ అంతటా జాతీయ జెండా సగం వరకు ఎగురవేయనున్నట్లు పేర్కొన్నారు.

సివిల్స్‌లో కదిరి వాసికి 918వ ర్యాంకు



కుమారునికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

కదిరి అర్బన్: యూపీఎస్సీ మంగళవారం విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో కదిరి పట్టణానికి చెందిన జి.సాయి షణ్ముఖకు 918వ ర్యాంకు వచ్చింది. అడపాలవీధిలో నివాసం ఉంటున్న రిటైర్డు ఏఎస్ఐ నరసింహులు, విజయభారతి దంపతుల కుమారుడు సాయి షణ్ముఖ సివిల్స్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని ఢిల్లీలో ఆరేళ్లగా ప్రిపేరవుతున్నాడు. ఐదవ ప్రయత్నంలో విజయం సాధించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తానీ స్థాయికి చేరుకున్నానని సాయి షణ్ముఖ తెలిపాడు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ధర్మవరం విద్యార్థుల సత్తా



హేమనందిని



భానుప్రకాష్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ధర్మవరం అర్బన్: తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ధర్మవరం విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు విడుదలయ్యాయి. ధర్మవరం పట్టణంలోని దుర్గానగర్‌లో నివసిస్తున్న హోంగార్డు కేఎస్ మహేష్, శ్యామల దంపతుల కూతురు హేమనందిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదువుతోంది. ఇంటర్ ఫస్టియర్, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 1000 మార్కులకు 990 మార్కులు సాధించింది. ధర్మవరం పేరు నిలబెట్టింది.

స్టేట్ సెకండ్ ర్యాంకు..

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ధర్మవరం పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన అచ్యుత శ్రీనివాసులు, ఉమామహేశ్వరి దంపతుల రెండో కుమారుడు అచ్యుత భానుప్రకాష్ ఎంఈసీలో 500 మార్కులకు 495 మార్కులతో తెలంగాణ రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచాడు. కాగా హేమనందిని, భానుప్రకాష్ ధర్మవరంలోని పీసీఎంఆర్ పాఠశాలలో పదో తరగతి చదివారు.

ఖాకీ డ్రెస్సు వేసుకుని డ్యూటీ చేయాల్సిన పోలీసులు... టీడీపీ నేతలకు వంగి వంగి సలాములు చేస్తున్న ఘటనలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇప్పటికే రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారుడు శ్రీరామ్‌ల పనిమనిషిలా మారారంటూ విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో 'పచ్చ' చొక్కా తొడుక్కున్న మరో డీఎస్పీ తెరమీదకు వచ్చారు. అత్యంత వివాదాస్పదుడిగా, టీడీపీకి కొమ్ముకాస్తున్న అధికారిగా పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ పేరు తెచ్చుకున్నారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి అండదండలతో పోస్టింగ్ తెచ్చుకున్న విజయకుమార్... టీడీపీ డీఎస్పీగా ముద్ర వేసుకున్నారు. గతంలో ఈయన శింగనమల టీడీపీ టికెట్ కోసం యత్నించడం గమనార్హం.



నేనింతే.. మారనంతే

టీడీపీ ఎమ్మెల్యేలు ఆడినట్టే ఆట.. పాడినట్టే పాట

- పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ వ్యవహార శైలిపై సర్వత్రా తీవ్ర చర్చ
- పల్లె రఘునాథరెడ్డి గీత గీస్తే దాటిపోకుండా డ్యూటీ
- గతంలోనూ పలు అవినీతి ఆరోపణలు
- ఇప్పటికీ తీరు మార్చుకోని వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇప్పటివరకూ పని చేసిన ప్రతి చోటా విజయకుమార్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. గతంలో అనంతపురం ఎస్పీగా అంజనా సిన్హా ఉన్నప్పుడు ఈయన చెన్నేకొత్తపల్లి ఎస్ఐగా పనిచేశారు. ఆ సమయంలో స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో ఆ మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేయగా, పోలీసు ఉన్నతాధికారులు అప్పట్లో కర్నూలుకు బదిలీ చేసి వీఆర్‌లో పెట్టారు. మైదుకూరులో డీఎస్పీగా పనిచేసినప్పుడు కూడా అవినీతి ఆరోపణలు రావడంతో శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేసి వీఆర్‌లో ఉంచారు.

గార్లదిన్నెలో పదెకరాల భూమి!

విజయకుమార్ పోలీసు ఉద్యోగంలో చేరిన తర్వాత అనంతపురం జిల్లాలోని గార్లదిన్నెలో హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారికి దగ్గరగా పదెకరాల భూమి కొన్నట్టు ఇప్పటికీ పోలీసు వర్గాలు కథలు కథలుగా చెప్పుకుంటున్నాయి. ఇంత పెద్ద ఎత్తున భూమి కొనడంపై చాలామంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కరపత్రాల కలకలం

గతంలో అనంతపురంలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) డీఎస్పీగా విజయకుమార్ ఉన్న సమయంలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీఎస్పీగా గంగయ్య ఉండేవారు. అప్పట్లో గంగయ్యకు, విజయమార్‌కు మధ్య తీవ్ర స్థాయిలో వివాదాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలోనే గంగయ్యపై కొన్ని కరపత్రాలు బయటకు వచ్చాయి. వీటిని విజయకుమార్ వేయించారనే విమర్శలున్నాయి. ఆ తర్వాత విజయకుమార్ బండారాలన్నీ బయటపెడుతూ బయటకు వచ్చిన కరపత్రాలు కలకలం రేపాయి.

ప్రబోదానంద కేసులో సస్పెండ్..

తనకు నచ్చినవారి కోసం పరిధి దాటి ప్రవర్తిస్తారని విజయకుమార్‌కు పేరుంది. గతంలో జేసీ అనుచరులు ప్రబోదానంద ఆశ్రమంపై దాడి చేసిన సమయంలో విజయకుమార్ ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా ఉండేవారు. అయినా సరే తాడిపత్రి ఇన్‌చార్జ్ డీఎస్పీగా వెళ్లి ఆ కేసును డీల్ చేశారు. ఆ కేసులో తీవ్ర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారులు విజయకుమార్‌ను సస్పెండ్ చేశారు.



ఇటీవల రామగిరి మండలం కుంటిమద్ది సమీపంలో హెలిప్యాడ్ వద్ద వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకుంటున్న డీఎస్పీ విజయకుమార్

మహిళా సీఐపై పరుషంగా..

ప్రస్తుతం పుట్టపర్తి డీఎస్పీగా ఉన్న విజయకుమార్ ఇప్పటికీ తన వివాదాస్పద తీరు మార్చుకోలేదని తెలిసింది. కొన్ని రోజుల క్రితం ఓ మహిళా సీఐపై ఇష్టారాజ్యంగా నోరుపారేసుకున్నారు. దీంతో మహిళా సీఐ తీవ్ర మనస్తాపం చెంది విజయకుమార్‌పై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అయితే, మహిళా సీఐకి న్యాయం చేయాల్సిన ఉన్నతాధికారులు.. బాధిత సీఐనే వీఆర్‌కు పంపించడం శ్రీసత్యసాయి జిల్లా పోలీసుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

రామగిరి హెలిప్యాడ్ ఘటనలో ఘోర వైఫల్యం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా ఇటీవల విజయకుమార్‌ను రామగిరి మండలం కుంటిమద్ది సమీపంలో హెలిప్యాడ్ వద్ద సెక్యూరిటీ ఇన్‌చార్జ్‌గా వేశారు. ఒక మాజీ సీఎం వస్తున్న నేపథ్యంలో నిక్కచ్చిగా బందోబస్తు చేపట్టాల్సిన డీఎస్పీ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో హెలికాప్టర్ వద్దకు వేలాదిగా జనం వెళ్లడంతో విండ్‌షీల్డ్ విరిగింది. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తప్పనిసరి పరిసితుల్లో రోడ్డుమార్గంలో బెంగళూరుకు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఖాకీ డ్రెస్సు వేసుకున్న ఈ పోలీసు అధికారి 'పచ్చ'చొక్కాల అడుగులకు మడుగులొత్తుతుండటం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

రంపం.. తీసింది ప్రాణం

- రోడ్డు ప్రమాద మృతి కేసులో వీడిన మిస్టరీ



సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డయిన రంపం తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులు

ధర్మవరం అర్బన్: ద్విచక్రవాహనంపై అజాగ్రత్తగా తీసుకొస్తున్న రంపం మరో ద్విచక్రవాహనదారుడి ప్రాణం తీసింది. రోడ్డు ప్రమాదంగా తొలుత నమోదైన ఈ కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణంలోని మహాత్మాగాంధీ కాలనీకి చెందిన బేల్దారి ఎం.ఆంజనేయులు (50) ఈ నెల 19న రాత్రి లక్ష్మీచెన్నకేశవపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆంజనేయులు మృతికి కారణం ఒక రంపమని పోలీసులు గుర్తించారు. లక్ష్మీచెన్నకేశవపురం సమీపంలోని భవనాలకు ఉన్న సీసీ కెమెరాలోని ఫుటేజీలో రాత్రి ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై పెద్ద పెద్ద చెట్లు కోసే రంపాన్ని తీసుకుని వెళుతున్నారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంలో వెళుతున్న ఆంజనేయులు మెడకు పక్కనే ద్విచక్రవాహనంలో తీసుకెళుతున్న రంపం తగిలింది. దీంతో ఆంజనేయులు మెడ తెగి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ హఠాత్పరిణామంతో రంపం తీసుకెళుతున్న ఇద్దరు వ్యక్తులు అక్కడి నుంచి ఉడాయించారు. సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫుటేజీ ఆధారంగా పోలీసులు రంపం తీసుకెళుతున్న ఇద్దరు వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

నేడు 'పది' ఫలితాలు

పుట్టపర్తి: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఉదయం 10 గంటలకు ఫలితాలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బంధువుల్లో ఉత్తీర్ణతపై ఆందోళన నెలకొనగా... రాష్ట్రస్థాయిలో జిల్లా స్థానంపై విద్యాశాఖ అధికారులు కలవరపడుతున్నారు. మార్చి 17 నుంచి ప్రారంభమైన పది పరీక్షలు ఈనెల 1తో ముగిశాయి. జిల్లాలో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 22,087 మంది పరీక్షలకు హాజరయ్యారు.

'కూటమి'లో కలహాలు

- ధర్మవరం పరిధిలో నిత్యం తగాదాలు
- తన్నుకుంటున్న ఇరు పార్టీల కార్యకర్తలు
- ఆధిపత్య పోరులో బీజేపీ - టీడీపీ నేతలు
- ప్రతి పనిలో తమదే నెగ్గాలంటూ పంతం



సాక్షి, పుట్టపర్తి: వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తోన్న ధర్మవరం నియోజకవర్గంలో కూటమి పార్టీల నేతల మధ్య కుమ్ములాటలు జరుగుతున్నాయి. అధికారంలో ఉన్నామని.. అందరూ కలిసిపోవాలని.. బడా నాయకులు పదే పదే ఉపన్యాసాలు ఇస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం కోల్డ్ వార్ నడుస్తూనే ఉంది. ఇరు పార్టీల నాయకుల మధ్య ఆధిపత్య పోరే తగాదాలకు కారణంగా తెలుస్తోంది. ధర్మవరం, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో టీడీపీ - బీజేపీ నేతల మధ్య జరిగిన గొడవలను నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రతి విషయంలోనూ తమ పంతం నెగ్గాలని టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌తో పాటు ఆయన అనుచరులు పట్టుబడుతున్నారు. అయితే బీజేపీ ప్రాతినిధ్యం సీటు కావడంతో పైచేయి సాధించాలని కమలనాథులు భావిస్తున్నారు.

పెద్దకోట్లలో ఆనంద్‌ను చితకబాది..

తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామంలో ఆనంద్ అనే బీజేపీ కార్యకర్తను టీడీపీకి చెందిన కొందరు వారం రోజుల క్రితం చితకబాదారు. తప్పించుకుని పరారీ కావడంతో ప్రాణాలతో బయటపడినట్లు సమాచారం. ఆ తర్వాత ఆనంద్ ధర్మవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. అక్కడా బెదిరించడంతో డిశ్చార్జి అయి ఇంటికి చేరుకుని మౌనంగా ఉన్నట్లు తెలిసింది. అయితే దీనిపై బీజేపీతో పాటు కురుబ సంఘం నాయకులు ప్రెస్‌మీట్ నిర్వహించి టీడీపీ కార్యకర్తలను హెచ్చరించారు. టీడీపీ నేతలు చేస్తోన్న అడ్డగోలు పనులను అడ్డుకునేయత్నం చేసినందుకే గొడవ జరిగినట్లు తెలిసింది.

ఎంపీపీ ఆది వాహనంపై రాళ్లు రువ్వి..

ముదిగుబ్బ ఎంపీపీ, బీజేపీ నేత ఆదినారాయణ యాదవ్ వెళ్తున్న కాన్వాయ్‌పై పరిటాల శ్రీరామ్ వర్గీయులు నెల రోజుల క్రితం రాళ్లు రువ్వారు. వీరనారాయణస్వామి పరుషలో పరిటాల వర్గీయుడైన ఉపేంద్రపై ఎంపీపీ ఆది అనుచరుడొకరు దాడి చేశారనే కారణంతో సంకేపల్లి వద్ద ఆది కాన్వాయ్‌పై పరిటాల వర్గం రాళ్లు రువ్వింది. ఆది యాదవ్ మంత్రి సత్యకుమార్‌కు దగ్గరగా ఉంటాడనే విషయం తెలిసినా.. పరిటాల శ్రీరామ్ వర్గం వదల్లేదు. అలాగే పెనుకొండ కియా వద్ద ఉన్న భూములకు సంబంధించి టీడీపీ నేత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి.. ఎంపీపీ ఆదికి మధ్య గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో ఇటీవల పలుమార్లు ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ పరిణామాలన్నీ కూటమిలో కలహాలకు అద్దం పడుతున్నాయి.

ధర్మవరంలో కుర్చీలు విసురుకుని..

కూటమి సర్కారు ఏర్పడిన కొత్తలోనే ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ షాపు డీలర్లు, అంగన్‌వాడీ టీచర్ల నియామకాల్లో టీడీపీ - బీజేపీ నేతల మధ్య యుద్ధం నడిచింది. తమ ఓట్లతో గెలిచి.. తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని పరిటాల శ్రీరామ్ వర్గీయులు గొడవ చేశారు. బీజేపీ కార్యాలయంలోనే కుర్చీలు విసిరి రచ్చ రచ్చ చేశారు. అయితే బీజేపీతో పాటు సమానంగా టీడీపీకి ఇవ్వడం కుదరదని చెప్పడంతో వివాదం మరింత ముదిరింది. కూటమి సర్కారు ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రతి విషయంలో ఇరు పార్టీల నాయకుల మధ్య విభేదాలు వెలుగు చూస్తూనే ఉండటం గమనార్హం.

పేదోడి బండి మరోసారి రద్దు

- నాడు కుంభమేళా పేరిట 3 నెలలు బంద్
- నేడు ధర్మవరం జంక్షన్‌లో పనుల నేపథ్యంలో రద్దు
- ప్యాసింజర్ రైళ్ల తాత్కాలిక రద్దుతో తప్పని ఇబ్బందులు

ముదిగుబ్బ: పేదలకు రైలు ప్రయాణం మరోమారు దూరం అయ్యింది. ధర్మవరం - తిరుపతి మార్గంలో తక్కువ టికెట్ ధరకే రాకపోకలు సాగించేవారు. ఇటీవల కుంభమేళా సందర్భంగా మూడు నెలల పాటు ప్యాసింజర్ రైళ్లు తాత్కాలికంగా రద్దు చేశారు. పునరుద్ధరణ తర్వాత నెల రోజులకే మరోమారు ప్యాసింజర్ రైళ్ల రాకపోకలకు బ్రేక్ పడింది. ఈ మార్గంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. కానీ ప్యాసింజర్ రైళ్లను మాత్రమే తాత్కాలికంగా రద్దు చేశారు. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు.

- అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల మీదుగా గుంతకల్లు-తిరుపతి- గుంతకల్లు (రైలు నంబర్ 57403- 57404), తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి (రైలు నంబర్ 57405-57406) ప్యాసింజర్ రైళ్లను ధర్మవరంలోని రైల్వే జంక్షన్‌లో ఫేజ్-2 యార్డ్‌లో ఎన్ఐ పనుల కోసం ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా ధర్మవరం -నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు (రైలు నెంబర్ 17247-17248 రైలు నర్సాపూర్ నుంచి కదిరి వరకు మాత్రమే నడుస్తుంది. ఈ రైళ్ల రద్దు కారణంగా ముదిగుబ్బ నుంచి ప్రయాణించే సాధారణ ఉద్యోగులు, పేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ముదిగుబ్బ రైల్వే స్టేషన్ ముఖ చిత్రం

ప్యాసింజర్ రైళ్లే ఎందుకు రద్దంటే..

ధర్మవరం జంక్షన్‌లో యార్డ్ సవరణ పనుల కోసం ప్యాసింజర్ రైళ్లు మాత్రమే రద్దు చేశారు. అయితే అదే లైనుపై నడుస్తున్న పద్మావతి, సెవెన్‌హిల్స్, అమరావతి, అకోలా, అరుణాచలం వెళ్లే ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రం నడుస్తున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజల కోసం ప్యాసింజర్ రైళ్లు రద్దు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తక్కువ ధరకే సౌకర్యవంతమైన ప్రయాణం..

ప్యాసింజర్ రైళ్లలో ప్రయాణించే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు రైలు టికెట్ ధర అతి తక్కువగా వుంది. ముదిగుబ్బ నుంచి తిరుపతికి టికెట్ ధర రూ.50 మాత్రమే. తిరుమలకు ముదిగుబ్బ నుంచి వందలాది మంది భక్తులు వెళ్తుంటారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడే పేద ప్రజలు తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్తుంటారు. అనంతపురం, ధర్మవరం, కదిరి నుంచి చాలా మంది ఉద్యోగస్తులు ప్యాసింజర్ రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారు. బస్సులో టికెట్ ధర ఎక్కువ కావడంతో రైలు ప్రయాణాన్నే చాలామంది ఎంచుకుంటున్నారు.

భారీగా తగ్గిన రైలు చార్జీలు..

ముదిగుబ్బ నుంచి తిరుపతికి ప్యాసింజర్ రైలులో వెళ్లే వారికి టికెట్ ధర రూ.50 మాత్రమే. స్లీపర్ టికెట్ ధర రూ.120 మాత్రమే. గతంలో ఇదే రిజర్వేషన్ టికెట్ ధర రూ.330 ఉండేది. సిట్టింగ్ కోసం రిజర్వేషన్ చేసుకునే టికెట్ ధర ముదిగుబ్బ నుంచి తిరుపతికి రూ.65 మాత్రమే. ఇదే టికెట్ ధర గతంలో రూ.120 ఉండేది.

ఇబ్బందులు పడుతున్నాం



ప్యాసింజర్ రైలు రద్దు చేయడంతో తిరుపతికి వెళ్లాలంటే మాలాంటి పేదవారు ఇబ్బందులు పడుతున్నారు. అదే బస్సులో వెళ్తే టికెట్‌కు అధిక ధర వెచ్చించాల్సి ఉంటుంది. అధికారులు ప్యాసింజర్ రైళ్లను త్వరగా పునరుద్ధరించాలని కోరుతున్నాం.
– మునిస్వామి, ముదిగుబ్బ

మే 19 నుంచి రైళ్ల పునరుద్ధరణ



ధర్మవరంలోని రైల్వే జంక్షన్‌లో ఫేజ్-2 యార్డ్‌లో ఎన్ఐ పనులు జరుగుతున్న కారణంగా నెలరోజుల పాటు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. ముదిగుబ్బ మీదుగా తిరిగే ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా మే 4 నుంచి 19 వరకు రేణిగుంట, కడప, గుత్తి జంక్షన్ మీదుగా నడుస్తాయి. మే 19 నుంచి అన్ని రైళ్లు నడుస్తాయి.
– నాగభూషణం, రైల్వే స్టేషన్ మాస్టర్, ముదిగుబ్బ

విప్ ధిక్కరిస్తే అనర్హత వేటు

- కలెక్టర్, ఆర్డీఓకు కదిరి మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నేతల వినతి

కదిరి అర్బన్/ కదిరి టౌన్/ ప్రశాంతి నిలయం: కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన 30 మంది కౌన్సిలర్లకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విప్ జారీ చేశారు. విప్‌ను ధిక్కరించిన వారిని పార్టీ నుంచి బహిష్కరించి అనర్హత వేటు వేయనున్నారు. ఈ మేరకు విప్ కాపీని మంగళవారం పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ ప్రణీత్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు కలెక్టర్ చేతన్, ఆర్డీఓ వీవీఎస్ శర్మలకు వేర్వేరుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ మార్గంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం చేజిక్కించుకోవడానికి టీడీపీ కుయుక్తులు పన్నుతోందన్నారు. ఇందు కోసం వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేస్తోందన్నారు. లొంగని వారిని బెదిరింపులకు గురిచేస్తోందని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, నిబంధనల మేరకు అవిశ్వాస తీర్మాన కార్యక్రమం నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా భర్త సాధిక్, కౌన్సిలర్లు రాంప్రసాద్, ఆవుల స్వామి, మహ్మద్, నాయకులు షబ్బీర్, నూరుల్లా, షాను తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కదిరి మున్సిపల్ పాలకమండలి సభ్యులు, నేతలు

నేడు అవిశ్వాస తీర్మానం..

కదిరి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసాతో పాటు వైస్ చైర్‌పర్సన్లు కొమ్ము గంగాదేవి, రాజశేఖర రెడ్డిలపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ వ్యవహరించనున్నారు. మున్సిపాలిటీలో 36 వార్డులు ఉన్నాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు 30 మంది, టీడీపీ నుంచి ఐదుగురు, టీడీపీ రెబల్‌గా గెలిచిన ఇండిపెండెంట్ ఒకరున్నారు. సార్వత్రిక ఎన్నికల సమ యంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు టీడీపీలోకి చేరారు. సంఖ్యా బలం తక్కువ ఉన్నప్పటికీ మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకునేందుకు టీడీపీ పావులు కదుపుతోంది. బెదిరింపులు, ప్రలోభాలతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను తమవైపు లాక్కుని బెంగళూరు క్యాంపునకు తీసుకెళ్లింది. వీరంతా బుధవారం బెంగళూరు నుంచి నేరుగా కదిరి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారు.

ముందస్తు ప్రణాళికలు రూపొందించండి

- సత్యసాయి శతజయంతి ఉత్సవాలపై సమీక్షలో కలెక్టర్

ప్రశాంతి నిలయం: సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపున ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సత్యసాయి శతజయంతి వేడుకల నిర్వహణపై ప్రభుత్వ అధికారులలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సత్యసాయి శతజయంతి వేడుకలు ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్నాయని, ప్రపంచ నలుమూలల నుంచి భక్తులతోపాటు ప్రముఖులు తరలిరానున్నారన్నారు. ప్రధాన మంత్రితోపాటు అత్యున్నత స్థాయి ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు. భక్తులకు, ప్రముఖులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పుట్టపర్తి విమానాశ్రయంలో ప్రత్యేక హెలిప్యాడ్‌ల ఏర్పాటుతోపాటు ఇంకా అవసరం అయితే అదనపు హెలిప్యాడ్‌ల ఏర్పాటుకు స్థలాల గుర్తింపు, భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్, పోలీస్ బందోబస్తు, రవాణా సేవలు, నిరంతర విద్యుత్, తాగునీరు, పట్టణ సుందరీకరణ పనులు, భక్తుల కోసం తాత్కాలిక బస్సు షెల్టర్ల ఏర్పాటు, తాత్కాలిక వసతి, మొబైల్ టాయిలెట్స్, చిత్రావతి నది సుందరీకరణ, భద్రతా చర్యలు, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు చలం, రోమెల్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ చేతన్

క్లుప్తంగా

పసుపులేటి రమేష్ అరెస్ట్



పసుపులేటి రమేష్

ఓడీచెరువు: అమడగూరు పరిధిలో దాడికి (అస్సాల్ట్) పాల్పడినందుకు గాను ఇప్పటికే పలు కేసులో నిందితుడిగా ఉన్న పసుపులేటి రమేష్‌బాబును పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు అమడగూరు పీఎస్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మల్లికార్జున వెల్లడించారు. జిల్లాలోని పలు స్టేషన్ల పరిధిలో అనేక చీటింగ్ కేసులు, దాడి కేసులు, సోషియల్ మీడియాలో రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు పోస్టు చేయడం తదితర అంశాలకు సంబంధించి పసుపులేటిపై కేసులు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో అమడగూరులో దాడికి పాల్పడిన కేసులో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం కొండకమర్లలో ఉన్న పసుపులేటి రమేష్‌బాబును అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ



బాధితురాలు అఖిల

అగళి: ఇంట్లో నిద్రిస్తున్న ఓ మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకెళ్లాడు. బాధితురాలు తెలిపిన మేరకు.. అగళి మండలం ఐ.తొణ సన్నపల్లిలో నివాసముంటున్న అఖిలకు కర్ణాటకలోని విరగనహళ్లికి చెందిన యువకుడితో వివాహమైంది. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వచ్చిన ఆమె సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మెడలోని 40 గ్రాముల బరువున్న బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

అతడికి ఆమె ఆధారం

- డ్రైవింగ్ వచ్చినా కాళ్లు సచ్చుబడి మంచానికే పరిమితమైన భర్త
- టైలరింగ్‌తో కుటుంబాన్ని పోషిస్తున్న భార్య
- ఆరోగ్యశ్రీ కార్డు లేక భర్తకు వైద్యం చేయించుకోలేని దుస్థితి
- దాతల సాయం కోసం ఎదురు చూస్తున్న దళిత నిరుపేద కుటుంబం

ఇంటి పెద్ద ఆరోగ్య పరిస్థితి బాగాలేని కుటుంబం. 9 ఏళ్ల వయసున్న కుమార్తె.. కుటుంబ బాధ్యత అంతా ఆమెపైనే.. నిలువ నీడ లేకపోతే ఆర్డీటీ వారు స్పందించి ఓ ఇల్లు కట్టించి ఇచ్చారు. రేషన్ కార్డు కూడా లేదు. ఆరోగ్యశ్రీకి దిక్కులేదు. ఈ పరిస్థితుల్లో అనారోగ్యంతో మంచాన పడిన భర్తను బాగు చేసుకోలేక తీవ్ర ఇబ్బంది పడుతోంది. ఇదీ కనగానపల్లి మండలానికి చెందిన పద్మావతి దీనస్థితి.



కాళ్లు సచ్చుబడి నడలేకపోతున్న భర్త వెంకటేష్‌తో భార్య పద్మావతి, కుమార్తె

దాతలు సాయం చేయదలిస్తే..

పేరు	: కె.పద్మావతి
గ్రామం	: మామిళ్లపల్లి, కనగానపల్లి మండలం
బ్యాంక్	: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, మామిళ్లపల్లి శాఖ
ఖాతా నెంబర్	: 9116 252 8096
ఐఎఫ్‌సీ కోడ్	: ఏపీజీబీ0001085
ఫోన్‌పే నంబర్	: 7416153998

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి ఎస్సీ కాలనీలో నివాసముంటున్న హరిజన వెంకటేష్, పద్మావతి దంపతులకు 9 ఏళ్ల వయసున్న కుమార్తె మధుప్రియ ఉంది. నిరుపేద కుటుంబం కావడంతో ఎప్పటి కప్పుడు కూలి పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో నిలువ నీడ లేకపోవడంతో ఆర్డీటీ స్పందించి... వారి సొంతింటి కలను సాకారం చేసింది. కారు డ్రైవింగ్ తెలిసిన వెంకటేష్... ఓ ప్రైవేట్ కారుకు డ్రైవర్‌గా వెళుతూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకోసాగాడు.

విధి వక్రీకరించి..

కుటుంబ పోషణ సజావుగా సాగిపోతోందనుకుంటున్న తరుణంలో వెంకటేష్ కుటుంబంపై విధి వక్రీకరించింది. ఎనిమిది నెలల క్రితం ఉన్నఫలంగా రెండు కాళ్లు వాపుతో సచ్చుబడిపోయాయి. దీంతో అనంతపురంలోని సర్వజనాస్పత్రితో పాటు పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా ఫలితం దక్కలేదు. వెన్నుముకలో గడ్డ ఉండడంతో ఆపరేషన్ చేసి తొలగిస్తే తప్ప కాళ్లు యథాస్థితికి రావని వైద్యులు నిర్ధారించారు. ఆపరేషన్ చేసేందుకు రూ.3 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని తెలిపారు. అసలే ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న నిరుపేద కుటుంబం పరిస్థితి గమనించి కొందరు స్నేహితులు అందజేసిన ఆర్థిక సాయంతో ఇంటి అవసరాలు తీరాయి. అయితే వెంకటేష్ శస్త్రచికిత్సకు అవసరమైన డబ్బు సమకూరక ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు ఆ కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సాయం పొందే అర్హత కూడా లేకపోయింది. దీంతో కొన్ని నెలలుగా వెంకటేష్ మంచానికే పరిమితమైపోయాడు. వాకర్ ఉన్నా... భార్య సాయం లేకపోతే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి.

అవసరానికి ఆదుకున్న టైలరింగ్..

సంపాదన పరుడైన భర్త మంచానికి పరిమితం కావడంతో పద్మావతికి దిక్కుతోచలేదు. ఈ క్రమంలో ఎప్పుడో తాను నేర్చుకున్న టైలరింగ్ ఆమెకు ప్రస్తుతం ఆదరవుగా మారింది. ఇంట్లోనే చిన్నపాటి కుట్టుమిషన్ ఏర్పాటు చేసుకుని టైలరింగ్ చేస్తున్నారు. వచ్చే అరకొర ఆదాయంతో భర్తకు మందులు, ఇంటి అవసరాలు తీరుతున్నాయి. ఈ నేపథ్యంలో కుమార్తె చదువులూ భారమయ్యాయి. రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు లేకపోవడంతో రూ.3 లక్షలకు పైగా ఖర్చుతో భర్తకు శస్త్రచికిత్స చేయించలేక ఇబ్బంది పడుతోంది. ఎవరైనా దాతలు స్పందించి తన భర్తను మామూలు మనిషిని చేయాలని వేడుకుంటోంది.

ఆరోగ్యవంతమైన సమాజమే ప్రధాన లక్ష్యం



పోషణ పక్వాడ స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్: ఆరోగ్యకరమైన పిల్లలతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడమే పోషణ అభియాన్ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా పోషణ ఆహార పక్షోత్సవాల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై క్షేత్రస్థాయిలో పిల్లలకు పంపిణీ చేస్తున్న పోషకాహారానికి సంబంధించిన ఆహార స్టాళ్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోషణ్ పక్వాడ వేడుకల్లో మొదట వెయ్యిరోజుల సంరక్షణపై శ్రద్ధ వహించడం అనే దానిపై అవగాహన కల్పిస్తోందన్నారు ప్రతి గర్భిణి పోషణ పక్వాడ, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఐసీడీఎస్, విద్యాశాఖ, డీఆర్‌డీఏ సమన్వయంతో జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలతో పాటు గిరిజన తండాల్లో పోషణ్ పక్వాడపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం, డీఈఓ కిష్టప్ప, పోషణ్ అభియాన్ డిస్టిక్ కోఆర్డినేటర్ సుధీర్‌వర్మ, డీసీపీఓ మహేష్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు

- వైఎస్సార్‌సీపీ నాయకులకు టీడీపీ సభ్యత్వ కార్డులు
- 'పచ్చ'పార్టీ నిర్వాకంపై పలువురు మండిపాటు



వైఎస్సార్‌సీపీ నాయకులకు పంపిన టీడీపీ సభ్యత్వ కార్డులు

పుట్టపర్తి అర్బన్: భారీగా సభ్యత్వ నమోదు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న టీడీపీ నాయకుల అసలు బండారం బయటపడింది. వైఎస్సార్‌సీపీ నాయకులకు సైతం వారి ప్రమేయం లేకుండానే సభ్యత్వ కార్డులు పంపిన 'పచ్చ' పార్టీ నిర్వాకాన్ని పలువురు తప్పుబడుతున్నారు. పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామ మాజీ సర్పంచ్ రామలక్ష్మమ్మ కుమారుడు కండె రవి, కోడలు శైలజ పేరుతో టీడీపీ సభ్యత్వ కార్డులు వచ్చాయి. వీటిని చూసి వారు కంగుతిన్నారు. వైఎస్సార్‌సీపీ అంటే ఎనలేని అభిమానం ఉన్న రామలక్ష్మమ్మ కుటుంబ సభ్యులు గ్రామంలోని 109 పోలింగ్ కేంద్రం పరిధిలో నివసిస్తున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వీరి పేర్లతో రెండు కార్డులను పోస్ట్ ద్వారా ఇంటికి పంపినట్లు రవి చెప్పారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రమేయంతోనే ఇలాంటి గిమ్మిక్కులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఎన్నో పథకాలతో ఆదుకున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయన మళ్లీ సీఎం కావడం ఖాయమని, తామెందుకు టీడీపీ వైపునకు పోతామని ఆయన అన్నారు.

ఉప సర్పంచ్ కుటుంబంపై టీడీపీ నేతల దాడి



విరిగిన చేతిని చూపిస్తున్న గణేష్ (పక్కన) బాధితుడు శ్రీరాములు

ఎన్పీకుంట: మండలంలోని బలిజపల్లి పంచాయతీ ఉప సర్పంచ్ లక్ష్మీదేవి కుటుంబ సభ్యులపై సోమవారం రాత్రి టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచారు. లక్ష్మీదేవి భర్త శ్రీరాములు తెలిపిన మేరకు.. బలిజపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 998-3వ లెటరులోని పట్టా భూమిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో తమకు చెందిన పట్టా భూమిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టరాదని భూ యజమానులు ఆక్షేపించడంతో పనులు ఆగిపోయాయి. అయితే ఆ పనులు ఉప సర్పంచ్ ఆపారనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత ఆంజనేయులు శ్రీరాములు కదిరికి వెళుతున్న సమయంలో వెంబడించి కదిరిలోనే దాడికి పాల్పడ్డాడు. తిరిగి అదే రోజు రాత్రి ఆంజనేయులు, వెంకటరమణ, విశ్వనాథ, మూర్తి, రమణ శ్రీరాములు ఇంటిపై దాడికి తెగబడ్డారు. ఘటనలో శ్రీరాములు పెద్ద కుమారుడు గణేష్ కాలికి, నడుముకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. రెండవ కుమారుడు కేశవపై పిడిగుద్దులతో కొట్టడంతో మూగ దెబ్బలు తగిలాయి. బాధితులు కదిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కదిరి ఆస్పత్రికి చేరుకుని బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. కాగా, తాము ఎదురుదాడికి దిగకపోయినా ఓ గర్భిణికి చెయ్యి విరిగిందంటూ తప్పుడు ఫిర్యాదుతో తమపై కేసు నమోదుకు టీడీపీ నాయకులు సిద్ధమయ్యారని బాధితులు తెలిపారు.

అక్రమ మద్యంపై నిఘా ఉంచండి

- ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య

పుట్టపర్తి టౌన్: ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమ మద్యం చొరబడకుండా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారులను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య ఆదేశించారు. మద్యం కేసులపై మంగళవారం పుట్టపర్తిలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్ నరసింహులుతో కలసి జిల్లా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలతో ఆయన సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పర్యటించి నాటు సారా తయారీ, అమ్మకం దారులను గుర్తించాలన్నారు. పాత నేరస్తులు, అనుమానితులు ఎవరైనా ఉంటే వెంటనే బైండోవర్ చేయించాలన్నారు. బైండోవర్ చేసిన తరువాత కూడా కేసుల్లో పట్టుబడితే రూ.లక్ష జరిమానా విధించాలని ఆదేశించారు. నాటు సారా తయారీ కేసుల్లో ఎవరైనా పట్టుబడితే వారితో పాటు బెల్లం విక్రయదారులపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరిగేలా చూడాలన్నారు. శిస్తు చెల్లించని అనుమతులు పొందిన మద్యం విక్రేతలపై చర్యలు తీసుకోవాలన్నారు. బెల్టుషాపులు లేకుండా చూడాలన్నారు. కల్తీ కల్లు విక్రయాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓల ధర్నా



నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

పుట్టపర్తి అర్బన్: వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద పని చేస్తున్న సీహెచ్‌ఓల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలంటూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీతభత్యాల విషయంగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని, అయితే ప్రభుత్వం ఇంత వరకూ స్పందించలేదన్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన వారికి సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్‌ఎస్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ఏటా 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను తీర్చాలని, జీతాలు సక్రమంగా చెల్లించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకూ శాంతియుత నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీ

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు జూనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం 1వ అదనపు సివిల్ జడ్జి ఈ.ప్రతిభను కడప ప్రిన్సిపల్ సివిల్‌జడ్జిగా బదిలీ చేశారు. అలాగే అనంతపురం మొబైల్ మేజిస్ట్రేట్ జె.సుజిన్‌కుమార్‌ను గుంటూరు జిల్లా సత్తెనపల్లి రెండో అదనపు సివిల్ జడ్జిగా, ధర్మవరం పిన్సిపల్ సివిల్ జడ్జి కె.రమ్యసాయిని చిత్తూరు జిల్లా పుత్తూరు అదనపు సివిల్ జడ్జిగా, హిందూపురం నుంచి ఎస్. రాజ్యలక్ష్మిని పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌కు, కదిరి నుంచి ఎస్.ప్రతిమను కర్నూలు జిల్లా బనగానపల్లికి, కళ్యాణదుర్గం నుంచి బి. సుబహాన్‌ను మదనపల్లికి, పెనుకొండ నుంచి ముజీబ్ పసపాలను పుట్టపర్తికి, పుట్టపర్తి నుంచి కె.రాకేష్‌ను పెనుకొండకు, కడప నుంచి జె.నందినిని ధర్మవరానికి, ప్రొద్దుటూరు నుంచి ఆర్.హారికను అనంతపురానికి, ఎం.అనిల్‌కుమార్‌ను తాడిపత్రికి, తాడిపత్రి నుంచి టి.కృష్ణవేణిని పశ్చిమ గోదావరి జిల్లా తణుకు కోర్టుకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారందరూ మే 2వ తేదీలోపు రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పరస్పర దాడిలో యువకులకు గాయాలు

ధర్మవరం అర్బన్: ఆన్‌లైన్ ఫ్రీ ఫైర్ గేమ్ ఆడుతూ ధర్మవరంలోని దిగువగేరి రామాలయం సమీపంలో ఇద్దరు యువకులు పరస్పరం కొట్టుకున్నారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన మేరకు.. దిగువగేరి రామాలయం సమీపంలో తులసీరామ్, గణేష్ ఇద్దరూ కలసి ఆన్‌లైన్ ఫ్రీఫైర్ గేమ్ ఆడుతూ గొడవపడ్డారు. ఆ సమయంలో ఎవరికి వారు తమ స్నేహితులను పిలిపించుకుని పరస్పర దాడులతో గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల పరస్పర ఫిర్యాదులతో ప్రధాన కారకులైన ఇద్దరితో పాటు వారి స్నేహితులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

ధర్మవరం అర్బన్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తమామ, ఆడపడుచుపై కేసు నమోదు చేసినట్లు ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ధర్మవరంలోని బాలాజీ నగర్‌కు చెందిన భువనేశ్వరిని ఆమె భర్త సుధీర్‌కుమార్, అత్తమామలు రంగనాయకులు, శారద, ఆడపడుచు సుధా అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై వరకట్నం వేధింపుల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు 'పురం' క్రీడాకారులు



గగన శ్రీ



లోకేష్ బాబు

హిందూపురం టౌన్: ఈ నెల 25వ తేది నుంచి 29వ తేదీ వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ బాల, బాలికల జట్టులో స్థానిక ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గగన శ్రీ, లోకేష్‌బాబు చోటు దక్కించుకున్నారు. ఎంపికైన క్రీడాకారులను మంగళవారం ఆ పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, పీడీలు లోకనాథ్, సురేష్, విలియం, రాణి, ప్రవీణ, ఉపాధ్యాయులు అభినందించారు.

బీపీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో బీపీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య బి.అనిత మంగళవారం విడుదల చేశారు. మొత్తం 33 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 29 మంది ఉత్తీర్ణులయ్యారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ధర్మవరం అర్బన్: స్థానిక పార్థసారథి నగర్‌లో నివాసముంటున్న లోకేష్ అక్రమంగా నిల్వ ఉంచిన 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అనంతపురం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. లోకేష్‌ను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నేటి నుంచి రాగుల కొనుగోలు

- కనీస మద్దతు ధర క్వింటాకు రూ.4,290

ప్రశాంతి నిలయం: రైతులు పండించిన రాగులను కనీస మద్దతు ధర క్వింటాలు రూ.4,290తో బుధవారం నుంచి ఏపీ పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. రబీలో రాగి సాగు చేసిన రైతులు రైతు సేవ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలలో విక్రయించ వచ్చని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా నిర్వహిస్తాయన్నారు. రబీ సీజన్‌లో రాగి పంటను ఈ- క్రాప్‌లో నమోదు చేసుకుని, ప్రభుత్వానికి పంటను అమ్మదలుచుకున్న రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించాలన్నారు. పౌరసరఫరాల సంస్థ ద్వారా ప్రభుత్వమే రైతులకు గోనె సంచులు అందజేసి, లోడింగ్ చార్జీలు, రవాణా చార్జీలను భరిస్తుందన్నారు. ఇప్పటికే రాగి పంట కోతలు పూర్తి చేసుకున్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ మునయ్య

పుట్టపర్తి: బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ మునయ్య మాట్లాడుతూ.. 40 సంవత్సరాల క్రితం సత్యసాయి బాబా చేతుల మీదుగా ఈ కళాశాల ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పట్లో హిందూపురం, కదిరి, ధర్మవరం, పెనుకొండలో మాత్రమే డిగ్రీ కళాశాలలు ఉండేవన్నారు. సత్యసాయి ఆశీస్సులతో బుక్కపట్నంలో ప్రారంభమైన డిగ్రీ కళాశాల ఈ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగకరంగా మారిందని కొనియాడారు. అనంతరం కళాశాల ఆవరణలో ఉన్న బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వర్‌ను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఓబులేసు, ఓబయ్య, గంగారాజు, శ్రీనివాసులు, ఆనంద్, దస్తగిరి, మహమ్మద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ కోర్సు ప్రారంభం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సంయుక్తంగా 'సర్టిఫికెట్ కోర్సు ఇన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ అండ్ టెస్టింగ్'ను ప్రారంభించాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, ఉద్యోగార్హత, పరిశ్రమల అనుసంధానం పెంచే లక్ష్యంతో ఈ కోర్సును ప్రవేశపెట్టారు. కళాశాల-పరిశ్రమల మధ్య ఉండే అంతరం తగ్గేలా నైపుణ్య ఆధారిత కోర్సును అందించేలా చర్యలు తీసుకున్నారు. గతంలో ప్రవేశపెట్టిన 'ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ వెంచర్ డెవలప్‌మెంట్' కోర్సు ద్వారా 400 మందికి పైగా విద్యార్థులు ప్రయోజనం పొందిన విషయం తెలిసిందే. తాజాగా రెండో కోర్సు సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ అండ్ టెస్టింగ్ కోర్సును మంగళవారం ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య బి.అనిత చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, అటల్ ఇంక్యుబేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగభూషణరాజు, ప్రిన్సిపాల్ ఎ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.


సాయి పథంలో భాగస్వాములుకండి

యువతకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌రాజు పిలుపు



సెమినార్‌ను ప్రారంభిస్తున్న రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: మానవాళి శ్రేయస్సు కోసం సత్యసాయి ప్రారంభించిన మిషన్‌లో భాగస్వాములు కావాలని యువతకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు పిలుపునిచ్చారు. సత్యసాయి సేవా మార్గంలో యువతను భాగస్వాములను చేసే లక్ష్యంగా ప్రశాంతి నిలయం వేదికగా తలపెట్టిన రెండు రోజుల వర్క్‌షాప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 1,500 మంది యువతీయువకులు హాజరయ్యారు. సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జ్యోతి ప్రజ్వలనతో సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, వైస్ చైర్మన్ నిమిష్ పాండే, తమిళనాడు రాష్ట్ర రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ సాయికుమార్‌తో కలసి రత్నాకర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలు మానవ సమూహంలో ఏర్పడే సవాళ్లను ఎదుర్కొవాలంటే మానసిక సామర్థ్యంతో పాటు, మానవీయ విలువను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పలువురు వక్తలు తమ సందేశాన్ని వినిపించారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న యువతీయువకులు